www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 ఏప్రిల్ 2024

5

ఏలూరు

ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎపి అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక స్థానిక అగ్రికల్చర్ జెడి ఆఫీస్‌లో జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా వివిఎన్ఆర్.గంగాధర్, కార్యదర్శిగా ఎమ్‌డి.రఫీ, కోశాధికారిగా బి.రాకేష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మినిస్టీరియల్ సిబ్బంది రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఇక్బాల్, రాష్ట్ర సెక్రటరీ ప్రసాద్, ఎన్నికల అధికారులుగా డిఎస్ఎన్.శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా అభినందించారు. వ్యవసాయ శాఖలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గాన్ని ఎన్‌జిఒ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి నెరుసు రామారావు అభినందించారు.

ఆక్వాకు పూర్వ వైభవం తెస్తాం

- రూపాయిన్నరకే ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్
- ధాన్యం అమ్ముకునేందుకూ లంచాలిచ్చుకునే దుస్థితి
- నర్సాపురం ఎంఎల్ఎ ముదునూరి అవినీతిలో పెద్ద ముదురు
- తాగునీరు, డ్రెయినేజీ, ఫిషింగ్ హార్బర్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం
- నరసాపురం పర్యటనలో చంద్రబాబు
- పాలకొల్లు సభలో టిడిపిలో చేరిన నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు

నరసాపురం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు

జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్వా సాగు సంక్షోభంలో కూరుకుపోయిందని, తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్వా రైతులకు పూర్వ వైభవం తెస్తామని, విద్యుత్ యూనిట్ రూపాయిన్నరకే అందిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు అన్నారు. ప్రజాగళం యాత్రలో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం, పాలకొల్లులో ఆయన పర్యటించారు. సాయంత్రం 4.45 గంటలకు నరసాపురం మండలం సీతారామపురంలోని స్వర్ణాంధ్ర కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ఆయన హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డుషోలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై ముస్లింలు, భవన నిర్మాణ కార్మికులు, ఆక్వా రైతులు చంద్రబాబుకు వినతిపత్రాలు ఇచ్చారు. సాయంత్రం 5.50 గంటలకు నరసాపురం పట్టణంలో స్టీమర్ రోడ్డుకు చేరుకున్న ఆయన అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుంచి మాట్లాడారు. తొలుత జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ నరసాపురంలో తాగునీటి ఇబ్బంది ఉందని, తీర ప్రాంతంలో కిడ్నీ సమస్యలు పెరుగుతున్నప్పటికీ డయాలసిస్ సౌకర్యాలు లేవని చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ మాట్లాడాక చంద్రబాబు మాట్లాడుతూ రైతుల పరిస్థితి ఏమాత్రం బాగోలేదన్నారు. ఎంత టెక్నాలజీ పెరిగినా రైతు లేకపోతే తిండి దొరకదన్నారు. జిల్లాలో ధాన్యం రైతులకు



పాలకొల్లు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

సంచులు ఇచ్చే పరిస్థితి లేదంటూ విమర్శించారు. లంచాలు ఇచ్చి ధాన్యం అమ్ముకునే దుస్థితికి జగన్ తీసుకొచ్చారన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రతియేటా రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొస్తామన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.

నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి పెద్ద ముదురు

నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అవినీతిలో పెద్ద ముదురు అని చంద్రబాబు విమర్శించారు. ఏటిగట్టు పనులు నాసిరకంగా చేసి దోచుకున్నాడన్నారు. మెడికల్ కాలేజీ వస్తుందని చెప్పి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేశాడని, కాలేజీ మాత్రం రాలేదని అన్నారు. రైతుల వద్ద ఇళ్ల స్థలాల కోసం భూములు తక్కువకు కొని మింగేశాడన్నారు. ఇసుక అక్రమ రవాణాతో రూ.30 కోట్ల వరకు దోచుకున్నాడన్నారు. లేఅవుట్లకు కప్పం కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారంలోకొచ్చాక తిన్నదంతా కక్కిస్తామన్నారు. పెదమైనవానిలంకలో సముద్రపు కోతకు గురికాకుండా గోడ నిర్మిస్తామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు. వలలు, బోట్లు అన్ని ఇస్తామన్నారు. పేరుపాలెం బీచ్‌తో పాటు మిగిలిన ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వశిష్ట గోదావరిపై వంతెన, షిప్పింగ్ హార్బర్ వంటివి అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రతి పేద కుటుంబానికి రెండు సెంట్లు ఇంటి జాగా ఇస్తామన్నారు. వాటర్ స్కీమ్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరందిస్తామన్నారు. భూగర్భ డ్రెయినేజీ ద్వారా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొత్తూరి రామరాజు, కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, జనసేన నాయకులు కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల 'రాజీ'నామాలు!

- రాజీనామాలు చేయండంటూ అధికార పార్టీ నేతల ఒత్తిడి
- గౌరవ వేతనం రూ.5 నుంచి రూ.10 వేల వరకూ ఇస్తామని ఎర
- జిల్లాలో వందలాది మంది వాలంటీర్లు రాజీనామా
- కోడ్ ఉల్లంఘించిన 15 మంది వాలంటీర్లను విధుల నుంచి తొలగింపు

'ఎన్నికల విధులకు దూరంగా ఉండాలి. కోడ్ అమల్లో ఉన్నందున అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, దూరంగా ఉండండి.. లేకపోతే వేటు తప్పదు'.. ఇవీ ఉన్నతాధికారుల హెచ్చరికలు. 'మీరంతా రాజీనామాలు చేయండి... వచ్చేది మన ప్రభుత్వమే.. మళ్లీ మీకే ఉద్యోగాలిప్పిస్తాం.. గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తాం' అంటూ అధికార పార్టీ నేతల ఒత్తిడి.. ఈ రెండింటి నడుమ వాలంటీర్లు విలవిల్లాడుతున్నారు. ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదుర్కొంటూ కేసుల బారిన పడుతున్న వాలంటీర్లు దిక్కుతోచని స్థితిలో మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు.

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో రాజీనామా చేసిన వాలంటీర్లు

వైసిపి అధికారం చేపట్టాక వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో వాలంటీర్లదే కీలకపాత్ర అనడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వం కూడా వాలంటీర్లపైనే ఆధారపడి పాలన సాగించింది. ఈ నేపథ్యంలో సాధారణ ఎన్నికలు తెరపైకి రావడంతో వాలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని కోర్టు ఆదేశాలిచ్చింది. అదే సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం కూడా హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో 9,167 మంది గ్రామ, వార్డు వాలంటీర్లు పని చేస్తున్నారు. ఇటీవల కాలంలో వీరిలో సుమారు 20 మందిపై అధికారులు చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలోనే పింఛన్ల పంపిణీ పనిని వాలంటీర్ల నుంచి తొలగించడంతో వారిలో ఒకింత సందిగ్ధత నెలకొంది. సందట్లో సడేమియాగా వాలంటీర్లు రాజీనామా చేసి ఎన్నికల ప్రచారం, డబ్బు పంపకాల్లో భాగస్వాములు కావాలని పోటీలో ఉన్న అధికార పార్టీ అభ్యర్థులు హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. వారిని నియమించే సమయంలోనే అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చేశారు. పార్టీకి అనుకూలంగా లేనివారిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ మూడు నెలలకోసారి ప్రకటిస్తూ ఎంపిడిఒల స్థాయిలోనే నియమిస్తూ వచ్చారు. అయితే గ్రామ, వార్డు వాలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం పదే పదే హెచ్చరిస్తున్నా కొందరు వాలంటీర్లు అత్యుత్సాహంతో ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ వాలంటీర్లపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల భీమవరం, ఉణుదుర్రు, నరసాపురం వంటి ప్రాంతాల్లో వాలంటీర్లపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని నిర్ధారిస్తూ సుమారు 15 మందిని విధుల నుంచి కలెక్టర్ తొలగించారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన వాలంటీర్ తమ గ్రూపులో అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ పోస్ట్ పెట్టడంతో సంబంధిత వాలంటీర్‌పై కేసు నమోదు చేశారు. ఒకపక్క అధికార పార్టీ ఒత్తిళ్లు, మరోపక్క ప్రతిపక్షాల విమర్శలతో వాలంటీర్లు సతమతమవుతున్నారు. అయితే కేసులు నమోదు చేసేందుకు సైతం ఎన్నికల సంఘం సిద్ధం కావడంతో వాలంటీర్లను భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలోనే వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు శ్రీకారం చుట్టారు. భీమవరంలోనే ఈ కాలంలో సుమారు 700 మంది వరకూ వాలంటీర్లు రాజీనామా చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు 1500 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు తెలిసింది. మరో రెండు, మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న వాలంటీర్లంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు సమాయతమవుతున్నట్లు సమాచారం.

మళ్లీ మీరే అంటూ భరోసా

వైసిపి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుంది. మళ్లీ మీకే వాలంటీర్ల పోస్టులు ఇస్తామని అధికార పార్టీ నేతలు రాజీనామా చేస్తున్న వారికి భరోసా కల్పిస్తున్నారు. వైసిపిని మరోసారి అధికారంలోకి తేవాల్సిన బాధ్యత వాలంటీర్లదేనని నొక్కి చెబుతున్నారు. ప్రస్తుతం ఇచ్చే రూ.5 వేల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని భరోసా కల్పిస్తున్నారు. వాలంటీర్లు అభ్యర్థుల ప్రచారం, పంపిణీల్లో బహిరంగంగా పాల్గొనాలని ఒత్తిడి తీసుకొస్తున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో వాలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల తర్వాత తమ పరిస్థితి ఏమిటనే సందిగ్ధంలో వారంతా పడ్డారు. చిన్నపాటి చిరుద్యోగాలు, వ్యాపారాలు, వృత్తులను సైతం వదులుకుని వాలంటీర్లుగా పని చేస్తున్నామని, ఇప్పుడు దీనికే ముప్పు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదుపుతప్పి తుప్పల్లోకి విద్యార్థుల బస్సు

పలువురికి స్వల్ప గాయాలు : తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి గ్రామ శివార్లలో శుక్రవారం సాయంత్రం ఓ విద్యాసంస్థ బస్సు అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకెళ్లిన ఘటనలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. జంగారెడ్డిగూడెంలోని ఓ విద్యాసంస్థకు చెందిన బస్సులో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు ములగలంపల్లి బయల్దేరారు. ఈ బస్సు తాడువాయి మీదుగా విద్యార్థులను దింపుకుంటూ ములగలంపల్లి శివార్లకు చేరుకుంది. మరికొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనే ఆనందంలో విద్యార్థులు ఉండగా రోడ్డుపై గోతిని తప్పించే ప్రయత్నంలో బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో ఎనిమిది మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరగ్గానే స్థానికులు స్పందించి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. పెనుప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఒరిగిన విద్యాసంస్థ బస్సు

చెక్‌పోస్టుల్లో తనిఖీలు పక్కాగా చేపట్టాలి

జిల్లాలో ఇంతవరకూ రూ.1.48 కోట్ల నగదు, మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - కామవరపుకోట

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలను నిశితంగా పరిశీలించాలని, తనిఖీలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు వాహనాలను ఆపి స్వయంగా పరిశీలించారు. చెక్‌పోస్టులోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. పరిశీలించిన వాహనాల నెంబర్లను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలిస్తున్న మద్యం, నగదు, గిఫ్ట్ ఐటమ్స్ వంటి వాటి రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ రూ.148.02 లక్షల నగదు, మద్యం తదితరాలు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. దీనిలో రూ.88.05 లక్షల నగదు, రూ.56.10 లక్షల విలువైన మద్యం స్వాధీనపర్చుకున్నారన్నారు. తనిఖీల ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కామవరపుకోట తహశీల్దార్ జెవిఆర్.రమేష్ మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో 102 వాహనాలను తనిఖీ చేశామని, రూ.79 వేల నగదు స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ రూ.తొమ్మిది లక్షల నగదును స్వాధీనపర్చుకున్నామన్నారు.

తనిఖీలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సిఐటియులో 210 మంది ఆటో డ్రైవర్లు చేరిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో పాత బస్టాండ్ సెంటర్లోని త్రిచక్ర ఆటో డ్రైవర్ యూనియన్, ఆశ్రం మెడికల్ కాలేజీ ఆటో డ్రైవర్స్ యూనియన్ డ్రైవర్లు మొత్తం 210 మంది సిఐటియులో చేరారు. శుక్రవారం ఉదయం పాత బస్టాండ్ వద్ద గల ఆటోస్టాండ్‌లో జరిగిన జనరల్ బాడీలో ఎఐటియుసి నుండి సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.సూరిబాబు, జె.గోపి మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిఐటియుకి ఉందన్నారు. నగరంలో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద విధిస్తున్న ఈ-చలానాలను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీసీ కెమెరాలను నేరస్తులను, నేరాలను అదుపు చేయడానికి ఉపయోగించాలని, ఆటో డ్రైవర్లపై ఈ-చలానాలు విధించడానికి సీసీ కెమెరాలను వినియోగించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నగరంలో స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న దాదాపు ఆరు వేల మంది ఆటో డ్రైవర్లను ఈ-చలానాలు విధించడం వల్ల తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించకపోవడం దుర్మార్గమని, అత్యంత లోపభూయిష్టంగా ఉన్నటువంటి స్టాప్‌లైన్, సీసీ కెమెరాలు క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ-చలానాల సమస్యను పరిష్కరించకుంటే రానున్న కాలంలో ఏలూరు నగరంలోని ఆటో డ్రైవర్లు అందరినీ సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐటియులో చేరుతున్న డ్రైవర్లకు నగర అధ్యక్షులు చక్రాల అమర్ కుమార్ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అమర్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లంతా ఐక్యంగా ఉంటే సమస్యలను పరిష్కరించుకుంటామని, నగరంలోని అనేక సమస్యలపై సిఐటియు పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. ద్విచక్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కోల రాజా, త్రినాధ్, నేతలు శివ, పాపారావు, నాని తదితరులు నాయకత్వం వహించారు.

నినదిస్తున్న ఆటో కార్మికులు

దళిత పేదలపై పోలీసుల వేధింపులు ఆపాలని వినతి

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు మండలం దోసపాడులోని దళిత పేదలపై పోలీసుల వేధింపులు ఆపాలని, అసైన్డ్ భూములు స్వాధీనపరచాలని వేధిస్తున్న భూస్వాములపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఈ సమస్యపై ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ జోక్యం చేసుకోవాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మికసంఘం, కెవిపిఎస్ నేతల బృందం అమరావతిలోని కార్యాలయ డిడికి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ దోసపాడులో 1956 నుంచి స్థానిక దళిత పేదలకు దఫదఫాలుగా ఇచ్చిన అసైన్డ్, సీలింగ్ పట్టాభూములు విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన దేవినేని బాజీప్రసాద్ తదితర భూస్వాములు ఆక్రమించి అనుభవిస్తున్నారని తెలిపారు. తిరిగి తమకు అప్పగించాలని పోరాడుతున్న దళితులపై పోలీసులు తీవ్ర వేధింపులు, ఇబ్బందులకు గురి చేస్తున్నారని, చట్టవిరుద్ధంగా సాగుచేస్తున్న భూస్వామి జోలికి మాత్రం వెళ్లడం లేదని తెలిపారు. తమ భూముల్లోకి వెళ్తున్న దళితులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి గ్రామంలో పదుల సంఖ్యలో పోలీసులు మొహరించి ఇళ్లకు వెళ్లి బెదిరించి గృహ నిర్బంధం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 31న 60 మంది పోలీసులు గ్రామంలో చొరబడి దళితుల ఇళ్లకు వెళ్లి బెదిరించి భూముల్లోకి వెళితే జైల్లో పెడతామని బెదిరించారని, రోజంతా గృహ నిర్బంధం చేశారని వాపోయారు. ఇప్పటికే దళితులపై ఆరు కేసులు నమోదు చేశారన్నారు. అసైన్డ్ భూములు, కొల్లేరుప్రాంతంలో ఆక్వా సాగు చేయకూడదనే నిబంధనలను ఉల్లంఘించి చేపల సాగు చేస్తున్నారని, చనిపోయిన కోళ్ల వ్యర్థాలను ఎరువులుగా చల్లుతున్నారని తెలిపారు. వీటిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసు, రెవెన్యూ శాఖలు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. జాయింట్ కలెక్టర్ కోర్టులో 70 ఎకరాలపై 145 సెక్షన్ విధించారని, అందులో భూస్వాములు సాగు చేస్తున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు నోరు మెదపడం లేదన్నారు. దళిత పేదలు తమ భూముల్లోకి వెళుతుంటే మాత్రం రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారన్నారు. ఇదే భూమిపై గతంలో లోకాయుక్త కోర్టు దళితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన అమలు చేయకుండా భూస్వాములకు కొమ్ముకాశారాన్నరు. ఈ భూములతోపాటు గ్రామంలో 230 ఎకరాల వరకు అసైన్డ్ భూములు ఉన్నాయని స్థానిక తహశీల్దార్ అంగీకరించారని, వాటిని దళిత పేదలకు పొజిషన్ అప్పగించాలని కోరుతున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీనిపై ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ జోక్యం చేసుకుని దళితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పి.ఆనందరావు, నాగేంద్ర, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నేతలు

కొనసాగిన 'పది' మూల్యాంకనం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం శుక్రవారం ఐదో రోజు 72.72 శాతానికి చేరిందని డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు. నగరంలోని సెయింట్ గ్జేవిఆర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల పేపర్ల మూల్యాంకనం ఐదు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. 1018 మంది సిబ్బంది మూల్యాంకనానికి హాజరయ్యారని, ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంతంగా జరిగిందని విద్యాశాఖాధికారి అబ్రహం తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఆర్‌డి బలరాం

టిడిపి గూటికి ఎంఆర్‌డి బలరాం దంపతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఇడా మాజీ ఛైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, మధ్యాహ్నపు బలరాం టిడిపి గూటికి చేరారు. వారు గురువారం వైసిపికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం నల్లజర్లలో టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో ఎంఆర్‌డి బలరాం దంపతులు, ఎఎంసి వైస్ ఛైర్మన్‌కంచన రామకృష్ణ టిడిపిలో చేరారు. అనంతరం స్థానిక పవం పేటలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బడేటి చంటి మాట్లాడుతూ టిడిపిలో ప్రతిఒక్కరికీ సమాన గౌరవం దక్కుతుందన్నారు. బలరాం కుటుంబంతో తమకెంతో అనుబంధం ఉందన్నారు. మధ్యాహ్నపు బలరాం మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో ఏలూరు నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇడా మాజీ ఛైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు తనకు వైసిపి టిక్కెట్ ఇస్తానని ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తదితరులు హామీ ఇచ్చారని, అయితే నమ్మించి మోసం చేశారని విమర్శించారు. భవిష్యత్తులో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించే సమర్ధత టిడిపి అధినేత చంద్రబాబుకే ఉందన్న నమ్మకంతో టిడిపిలో చేరినట్లు తెలిపారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సువిధ' ద్వారా 583 అభ్యర్థనలకు అనుమతి

జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ/ఎన్‌కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇంతవరకూ 583 అనుమతులు ఇచ్చామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యాన ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటన్నామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా గురువారం రాత్రి వరకు 862 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 583 అనుమతులు జారీ చేయగా మరో 8 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయని 271 తిరస్కరించబడ్డాయన్నారు. సి-విజిల్ ద్వారా 259 ఫిర్యాదులు అందగా వాటిలో 162 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మరో 97 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించారన్నారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెసేజ్/ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలు అధికార యంత్రాంగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నెంబర్ 9491041435 అందుబాటులో ఉంచామని, ప్రజలు దీన్ని వినియోగించుకుని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఫిర్యాదుల నమోదు కోసం కలెక్టరేట్ కాల్ సెంటర్ నెంబర్ 1800 233 1077 ఏర్పాటు చేశామన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దోమలు మానవాళికి ప్రధాన శత్రువుగా పరిణమించాయని, దోమల నిర్మూలన ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యపడుతుందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. సత్రంపాడు ఎంఆర్‌సి కాలనీలో జరుగుతున్న ఫ్రైడే, డ్రై డే కార్యక్రమంలో గోవిందరావు మాట్లాడుతూ మురుగు నీటిలో పెరిగి, గృహాల్లో ఉంటూ మన రక్తాన్ని తాగి, ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చేసే దోమ మనకు నిజమైన శత్రువు అని తెలిపారు. దోమలు పెరిగే స్థలాలైనా నీటి నిల్వ ప్రాంతాలు, డ్రమ్ములు, మూతలు లేని నూతులు, టైర్లు, పగిలిపోయిన వస్తువులు, కొబ్బరి బొండాలు, సంపులు, రుబ్బురోలు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్ వెనుక బాక్సు మొదలగు స్థలాలలో దోమలు పెరుగుతాయన్నారు. కావున ప్రజలందరూ వారానికి ఒకటి, రెండుసార్లు నీటి నిలువ ప్రాంతాల్లో క్లీన్ చేసుకోవాలని, పనికిరాని వస్తువులు విసర్జించాలన్నారు. సాయంత్రం సమయంలో కిటికీలు, దోమతెరలు, మస్కిటో కాయిల్స్, మురికి నీటి నిల్వ ప్రాంతాల్లో వాడేసిన ఇంజన్ ఆయిల్ చల్లాలని, దోమల వ్యాప్తిని అరికట్టటంలో ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని, శీతాకాలంలో వైరల్ వ్యాధులు విజృంభించే అవకాశం వుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎన్‌వి బిడిసిపి రిజర్వ్ ఎంపీ హెచ్ఇఒ ఎమ్.పార్వతీశం, హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, ఆరోగ్య కార్యకర్త బిక్షాలు, ఎంఎల్‌హెచ్ పి.నాగ దుర్గమ్మ, ఆశా కార్యకర్తలు సుజాత ప్రమీల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న గోవిందరావు

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

బాబు జగ్జీవన్ రావు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కష్టపడ్డారని జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో బాబు జగ్జీవన్ రావు 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు రోడ్‌లో సూరయ్య స్వీట్స్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చిటికల అచ్చిరాజు, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, 13వ వార్డ్ కౌన్సిలర్ పిపిఎన్ చంద్రరావు, ఆరవ వార్డు కౌన్సిలర్ నేకూరి కిశోర్ పాల్గొన్నారు.

పోలవరం : దుప్పట్లు పంపిణీ..

బుట్టాయగూడెం: బాబు జగ్జీవన్ రావు దళితుల కోసం నిరంతరం పాటుపడుతూ కార్మిక చట్టాలు అమలు చేయడంలో కార్మికశాఖా మంత్రిగా ఉండగా దళితుల అభివృద్ధి కోసం కృషి చేశారని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ అన్నారు. డప్పు కళాకారుల ఆధ్వర్యాన శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నాయన్నారు. క్రైస్తవులకు, ముస్లింలకు రక్షణ లేకుండా పోతుందని, బిజెపి మిత్రపక్ష కూటమిని ఓడించాలని, దళితుల చట్టాల్ని కాపాడాలని ఫ్రాన్సిస్ అన్నారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం నాయకులు దండపాటి వెంకటేశ్వరావు, తగరం కన్నయ్య, దండపాటి రమేష్, తగరం కన్నయ్య, గంగరాజు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నేతలు

కొయ్యలగూడెం: స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని, విశిష్ట పార్లమెంటేరియన్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కొయ్యలగూడెంలో ఉన్న ఆయన విగ్రహానికి జనసేన పట్టణ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కొయ్యలగూడెం మండల అధ్యక్షులు తోట రవి, సీనియర్ నాయకులు దుగ్గిన శ్రీను, రెండు జిల్లాల జోనల్ సభ్యులు చోడి పిండి సుబ్రహ్మణ్యం, మేకల సత్య తేజ, సరిపల్లి జనసేన సర్పంచి తాడేపల్లి గోపి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు వెళ్లాలని తెలిపారు.

కొయ్యలగూడెం ఎస్‌సి కాలనీలో జగ్జీవన్ రామ్ యూత్ అధ్యక్షులు బొబ్బర చిట్టిబాబు ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముసునూరు : భారత స్వతంత్ర సమరయోధుడు, స్వతంత్ర భారతదేశం గర్వించే ముద్దుబిడ్డ భారతదేశ మాజీ రక్షణ వ్యవసాయ కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన బడుగు బలహీన వర్గాల ముద్దుబిడ్డ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మండలంలోని 16 గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాట్రేనిపాడు గ్రామంలో నూజివీడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కంబాల కృష్ణవేణి రాంబాబు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ కార్మిక శాఖా మంత్రిగా చేసిన సమయంలో భారతదేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాల సహకారంతో కార్మికుల హక్కులను, వారి ప్రయోజనాలను కాపాడడానికి కృషి చేశారన్నారు. మహనీయుని స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల ఐక్యత చాటుదామని పిలుపునిచ్చారు. ముసు నూరులో మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ, వైసిపి మండల యువజన నాయకులు జి.రంగరావు, గుడిపాడు గ్రామంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, కొల్లి గంగారం, మండలపు ధర్మరాజు, మసిముకు సుబ్బారావు, వలసపల్లి గ్రామంలో మేదరమెట్ల సురేంద్ర, కాట్రేనిపాడు గ్రామంలో టిడిపి నాయకులు, సర్పంచి గద్దల సుహాసిని మోహన్ రావు, ఎంపిటిసి సూర్య దేవర నాగ మంజుల శ్రీనివాస రావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, లోపూడిలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గ భవాని వెంకట్రావ్, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన, వైస్ ఎంపిపి పాముల గంగాధర్ రావు, సర్పంచి పేరం కృష్ణల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ముసునూరు : నివాళులర్పిస్తున్న నేతలు

చింతలపూడి: భారతదేశంలో అనేక కార్మిక సంక్షేమ విధానాలకు పునాది వేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని అంబేద్కర్ ఇండియన్ మిషన్ నాయకులు ఎన్ఎస్.రాజేంద్ర, కాకర్ల సత్యం అన్నారు. చింతలపూడి పట్టణంలో జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెన్నారావు, జైపాల్ పాల్గొన్నారు.

కుల రహిత సమాజం కోసం జీవితాంతం కృషి చేసిన బడుగు బలహీన వర్గాల నేత, కేవలం దళితుల కోసమే కాదు అన్ని వర్గాల వారి అభ్యున్నతి గురించి ఆలోచించిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని చింతలపూడి నగర పంచాయతీ టిడిపి ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్ అన్నారు.

టి.నరసాపురం : బాబూ జగ్జీవన్ రామ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కె.జగ్గవరం గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 116వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీను రాజు, వైసిపి ఏలూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, కేతవరం సర్పంచి తడికలపూడి శివ మాధవి కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను వ్యవసాయ శాఖ జెడి కార్యాలయం ఏలూరులో షేక్ హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయ అధికారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మినిస్టీరియల్ సిబ్బంది, రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డీ ఇక్బాల్, రాష్ట్ర సెక్రెటరీ ప్రసాద్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేసే యావన్మంది సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పట్టణంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ దేశాభివృద్ధికి, దళితుల అభ్యున్నతికి బాబు జగజీవన్ రామ్ కృషి చేశారన్నారు.

టిడిపి కార్యాలయంలో శుక్రవారం బాబు జగజీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జి కొలుసు పార్థసారథి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉంగుటూరు: అనాధిగా వస్తున్న దళితుల పట్ల అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేసిన వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని వక్తలు కొనియాడారు. ఆయన జయంతి వేడుకలు మండలంలోని నారాయణపురం, ఉంగుటూరు, కాగుపాడు తదితర గ్రామాల్లో నిర్వహించి విగ్రహాలను పూలదండలతో అలకరించారు. దళిత సేన పోరాట సమితి అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం, నారాయణపురం సర్పంచి అలకనంద, ఉంగుటూరు సర్పంచి బండారు సింధు పాల్గొన్నారు.

పోలవరం: బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న విగ్రహానికి అభ్యుదయ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సోబ్బన మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు రొక్కల మేషేక్, తోలేటి రఘు, ఉండ్రాజవరపు మూర్తి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను మొండ్రు సురేష్, విస్సాంపల్లి రాజా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విగ్రహ కమిటీ సెక్రటరీ మోదుగు ముత్తయ్య, ఇసంపల్లి రాజేష్, విసంపల్లి మురళీ, రామకృష్ణ పాల్గొన్నారు.

ముదినేపల్లి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ బిక్షాలు అన్నారు. భారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవనరామ్ జయంతి వేడుకలు శుక్రవారం మండలంలోని చేవూరు గూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు యేసపోగు దానియేలు, బి.ఇశ్రాయేలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం అన్నపనేనివారి గూడెం గ్రామంలో ఆర్‌టిసి బస్సును స్థానిక గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏలూరు నుంచి వయా రామచంద్రపురం బోగోలు, రంగాపురం, కె.గోకవరం మీదుగా అన్నపనేనివారి గూడెంలో 38 సంవత్సరముల నుంచి తిరుగుతున్న బస్సు ఏ టైంలో వస్తుందో, వెళుతుందో తెలియని పరిస్థితుల్లో గ్రామస్తులు ఉన్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మాల మహాసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరిపల్లి పెద్దిరాజుకు సమాచారం రావడంతో వెంటనే స్పందించి స్థానిక అన్నపనేని వారి గూడెంలో గ్రామస్తుల సహాయంతో బస్సును నిలిపి ఫోన్ కాల్‌లో సంబంధిత సిబ్బందితో మాట్లాడమన్నారు. బస్సు గతంలో ఏ విధంగా రాత్రి పూట అన్నపనేనివారి గూడెం గ్రామంలో ఉంచి, తెల్లవారి జామున ఫస్ట్ బస్సుగా కంటిన్యూ చేయాలని గ్రామస్తులు తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో హాస్పటల్‌కి, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని, ఆటో సౌకర్యం కూడా ఉండదని, ఈ బస్సు సౌకర్యం వల్ల మాకు మంచి సౌకర్యం కల్పించిన వారు అవుతారని గ్రామస్తులు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

టి.నరసాపురం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని భుక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భుక్యా వేణు అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామం పంచముఖ గుడి సెంటర్‌లో బంజారా బజరంగీ భేరి, భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జరభల చందా నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భూక్యా గోపయ్య, వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జరభల పూర్ణయ్య పాల్గొన్నారు.

మసీదుల్లో ముస్లిముల ఉపవాస ప్రార్థనలు

పోలవరం: మండలంలో రంజాన్ చివరి శుక్రవారం కావడంతో మసీదులో పవిత్ర ఉపవాస ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. అహెలె సున్నత్ జమాతె మసీదులో భక్తి శ్రద్ధలతో దాన ధర్మాలతో ప్రత్యేక నమాజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ అధ్యక్షులు ఎమ్‌డీ యాసీన్ షరీఫ్ తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులతో సాయంత్రం ఇఫ్తార్ విందులలో అల్పాహారాలు, పౌష్టికాహారాలు ఒకరికి ఒకరు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతికి సంతాపం

శ్రీనివాసరావు(ఫైల్)

ఏలూరు: ఏలూరు నగరపాలక సంస్థ వీధిలైట్ల విభాగం యూనియన్ నాయకులు మందా శ్రీనివాసరావు గురువారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ ఆంధ్ర ఆసుపత్రిలో మృతి చెందారు. మందా శ్రీనివాసరావు డ్యూటీలో ఉండగా ఈనెల 12వ తేదీన ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారు. గత 22 రోజులుగా ఆయన వెంటిలేటర్‌పై ఉంటూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య, జిల్లా కార్యదర్శి ఎ.జాన్ బాబు, వీధిలైట్ల విభాగం అధ్యక్షులు జి.ఏసు నాథ్, వాటర్ వర్క్స్ విభాగం అధ్యక్షులు వినుకొండ రమేష్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథరావు, వి.సా యిబాబు, సిపిఎం నగర కార్యదర్శి పల్లెం కిషోర్, ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా కార్యదర్శి జె.గోపి ఆసుపత్రికి వెళ్లి, మందా శ్రీనివాసరావు భౌతికకాయం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పంపుల చెరువు గొల్లాయిగూడెం మీదుగా హనుమాన్ నగర్ స్మశాన వాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఈ అంతిమయాత్రలో మున్సిపల్ కార్మికులు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకట్ కృష్ణ, వీధిలైట్ల విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ శేషగిరి మందా శ్రీనివాసరావు భౌతిక ఖాయం సందర్శించి నివాళులర్పించారు.

గుండుగొలనులో 'మన ఊరికి మన వాసన్న'

భీమడోలు : గుండుగొలను గ్రామ పరిధిలోని డోకల వారి వీధిలో మన ఊరికి మన వాసన్న కార్యక్రమాన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. వైసిపి శ్రేణులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచి, వైసిపి గ్రామ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణ రాజు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గత ఐదు సంవత్సరాల కాలంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు.

'డిఎన్ఆర్‌ను మళ్లీ ఎంఎల్ఎగా గెలిపించాలి'

ముదినేపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్ఎగా దూలం నాగేశ్వరరావును, ఎంపీగా కారుమూరు సునీల్ కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. శుక్రవారం మండలంలోని ములకలపల్లిలో వైసిపి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎంపిపి సత్యనారాయణ పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదు

టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సభ్యురాలు మేఘలాదేవి

కొయ్యలగూడెం: వాలంటీర్లకు రాబోయే టిడిపి ప్రభుత్వంలో న్యాయం చేస్తామని, వాలంటీర్ వ్యవస్థకు టిడిపి వ్యతిరేకం కాదని, రాజకీయాలు చేసే వాలంటీర్లకు మాత్రమే టిడిపి వ్యతిరేకమని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సభ్యురాలు మేఘలాదేవి అన్నారు. వాలంటీర్లను రెచ్చగొట్టి జగన్ రెడ్డి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. పేదలు, వృద్ధులు, వికలాంగుల పింఛన్లతో జగన్ కొత్త డ్రామా ఆడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులే లబ్ధిదారుల ఇంటివద్దకే పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినా జగన్ ఎందుకు భేఖాతరు చేస్తున్నారని ప్రశ్నించారు. జగన్ ఉద్దేశపూర్వకంగానే పింఛన్లు ఆపుతున్నారని మేఘల దేవి అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.26 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు. గ్రామంలో సగటున 45 మంది పింఛన్‌దారులకు ఇంటింటికీ వెళ్లి రోజుకు 20 పింఛన్లు ఇచ్చినా రెండు రోజుల్లో మొత్తం పింఛన్ల పంపిణీ పూర్తిచేయొచ్చన్నారు. ఎన్‌టి రామారావు రూ.35తో పింఛన్ పథకాన్ని ప్రారంభిస్తే, 2014లో చంద్రబాబు నాయుడు రూ.200 ఉన్న పింఛన్‌ను వెయ్యికి, 2019 రూ.2 వేలకు పెంచారు. జగన్ ఏడాదికి రూ.250 చొప్పున ఐదేళ్లలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెంచారన్నారు. రూ.200 పింఛన్‌ను రూ.2 వేలు చేసి అన్న క్యాంటీన్లు ద్వారా పేదల ఆకలి తీర్చిన చంద్రబాబు నాయుడిపై విమర్శలు చేస్తారా అని ఘాటుగా విమర్శించారు. పింఛన్ల పంపిణీ వ్యవహారంలో జగన్ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తోందన్నారు. జగన్ జీవితమంతా బూటకపు రాజకీయాలు, శవ రాజకీయాలు, ప్రచార ఆర్భాటాలు తప్ప పేదలకు మేలు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని పున:నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమ, దేవి పాల్గొన్నారు.

వైసిపి విజయానికి తోడ్పడాలి

చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి ఫలాలు మళ్లీ ప్రజలకు అందాలంటే వైసిపి ప్రభుత్వమే రావాలని, అందుకు ప్రతి ఒక్కరూ వైసిపి విజయానికి తోడ్పడాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయ రాజు కోరారు. లింగపాలెం మండలం కలరాయి గూడెం, లక్ష్మీపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం వైసిపి బూత్ కన్వీనర్ బందారు లక్ష్మణ్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడడంతో మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

జంగారెడ్డిగూడెం టౌన్: విద్యాప్రగతికి విద్యాప్రోత్సాహకం అందించేందుకు ముందుకు రావడం, ఇచ్చిన మాటకు కట్టుబడి గత మూడు సంవత్సరాల నుంచి ప్రోత్సాహం అందించడం అభినందనీయమని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎల్క దాసారపు కృష్ణ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, క్రీడాభిమాని కొమ్మారెడ్డి చిరంజీవి జ్ఞాపకార్థం వారి కుమారులు యువ వైద్యులు డాక్టర్ సంజీవరావు, వంశీకృష్ణలతో కూడిన చిరంజీవి కుటుంబసభ్యులు రోటరీ జంగారెడ్డిగూడెం ద్వారా 21–22 నుంచి ముగ్గురు విద్యార్థులకు గుమ్మ సాయి గోపీపూర్ణిమకు రూ.20 వేలు, కటారి తనిష్ కుమార్, బందారు తేజస్వరీలకు చెరో రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.50వేలు అందిస్తున్నారు, చెక్కుల ద్వారా పంపిణీ చేశామని తెలిపారు. దాతలు డాక్టర్ చిరంజీవి కుటుంబసభ్యులకు రోటరీ నుంచి రొంగల దేవీప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

గుండెపోటుతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి

చాట్రాయి: మండల విద్యాశాఖ కార్యాలయంలో 20 సంవత్సరాల నుంచి కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న కంకట బాబురావు(46) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. యథావిధిగా కార్యాలయంలో పని ముగించుకుని ఇంటికి వచ్చిన తరువాత గుండెపోటుకు గురికాగా వెంటనే భార్య చుట్టుపక్కల వారు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందారని తెలిపారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన మండలంలోని సూరేపల్లి గ్రామానికి తరలించారు. బాబురావు మరణ వార్త తెలుసుకున్న కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు లాం తాంతియా కుమారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మారావు సంతాపాన్ని తెలిపారు.

జగన్‌వి నీచ రాజకీయాలు : చింతమనేని

ఏలూరు టౌన్: తల్లికి, చెల్లికి, కుటుంబ సభ్యులకే న్యాయం చేయలేని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలకు విరక్తి చెంది పెద్ద ఎత్తున దెందులూరు నియోజకవర్గం నుంచి టిడిపి, జనసేన కూటమికి మద్దతు పలుకుతూ వైసిపి, కాంగ్రెస్ నుంచి టిడిపిలోకి చేరుతున్నారని దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఏలూరు టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం దెందులూరు నియోజకవర్గం పోతునూరు గ్రామంలోని టిడిపి కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నేత పోతునూరు సహకార సంఘం బ్యాంకు మాజీ అధ్యక్షులు, రాజకీయ చాణక్యుడిగా పేరుపొందిన కొత్త సాంబశివరావుతో పాటు, కరుడుగట్టిన వైసిపి నేత బెజవాడ వెంకటేశ్వరరావు, పలువురు వైసిపి నేతలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్‌టిఆర్ అభిమాన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు బోడ్డేటి మోహన్ బాబు పాల్గొన్నారు.

యునైటెడ్ ఫ్రంట్ ఎంపీ అభ్యర్థిగా సంతోష్‌కుమార్

ఏలూరు సిటీ: రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరగాలన్న, సమర్థవంతన పాలన జరగాలన్న వెంటనే వాలంటరీ వ్యవస్థను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని విధుల నుంచి తప్పించాలని ఎపి యునైటెడ్ ఫ్రంట్ పార్టీ కోఆర్డినేటర్ రఘు మల్లేపల్లి అన్నారు. ఏలూరు నగరంలో లేడీస్ లైన్స్ క్లబ్ వద్ద శుక్రవారం ఎపి యునైటెడ్ ఫ్రంట్ పార్టీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా మొండెం సంతోష్ కుమార్‌ని ప్రకటిస్తూ వారి మేనిఫెస్టోని యునైటెడ్ ఫ్రంట్ కోఆర్డినేటర్ డాక్టర్ రఘు మల్లేపల్లి విడుదల చేశారు. ఏలూరు స్థానిక లేడీస్ లైన్స్ క్లబ్‌లో ఎపి యునైటెడ్ ఫ్రంట్ పార్టీ కోఆర్డినేటర్ రఘు మల్లేపల్లి, నవరంగ్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జలీల్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘు మల్లేపల్లి మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో విఫలమైన రాష్ట్ర డిజిపి రాజేంద్రరెడ్డిని వెంటనే విధుల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక పరీక్షలు

నూజివీడు రూరల్: ఈనెల 6వ తేదీ నుంచి విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించుచున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఎం.సేవ్య తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడులో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఒకటవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా గంట గంటకు విద్యార్థులకు మంచినీరు అందించడం జరుగుతుందని, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

గుబ్బల మంగమ్మ సన్నిధిలో కలెక్టర్

బుట్టాయగూడెం: మండలంలోని కొరసవారిగూడెం పంచాయతీ కామవరం గ్రామ సమీపంలో దట్టమైన అడవిలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లిని కుటుంబ సమేతంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, మానస దంపతులు దర్శించుకున్నారు. వీరివెంట తహశీల్దార్ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ వెంకన్న ఉన్నారు.

చిన వెంకన్న సన్నిధిలో పురంధేశ్వరి, మహేష్ యాదవ్

ద్వారకాతిరుమల: రాజమండ్రి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి అయిన దగ్గుపాటి పురంధరేశ్వరి, ఏలూరు టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని శుక్రవారం ఉదయం విడివిడిగా దర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తర్వాత ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి చినవెంకన్న జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు.

నేరాలు - ఘోరాలు

క్షతగాత్రుడు మృతి

భీమడోలు: ఆగడాల లంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఒకరు చనిపోయినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆగడాల లంక గ్రామానికి చెందిన భలే ఆనందరావు(48) గతనెల 15వ తేదీన మోటారు సైకిల్‌పై వెళుతూ ఆగడాల లంక వద్ద గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం చనిపోయారని తెలిపారు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిరుమలదేవిపేట పంచాయతీలోని వెంకటాపురం గ్రామానికి చెందిన షెడ్యూల్డ్ కులానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన వ్యక్తి గత కొంతకాలంగా ఆమె వెంటపడుతూ, ఇంటి చుట్టూ తిరుగుతూ తన కోరిక తీర్చమని వేధిస్తున్నట్లు మహిళ ఫిర్యాదుతో అతనిపై లైంగిక వేధింపులు, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం పట్టివేత

జీలుగుమిల్లి: మండలంలోని తాటియాకుల గూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద శుక్రవారం సాయంత్రం ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రకు కార్‌లో తరలిస్తున్న 6 మద్యం బాటిళ్లను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మద్యాన్ని, కార్‌ను సీజ్ చేసి, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

పెదవేగి ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఎన్నికల సందర్భంగా గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని పెదవేగి ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పెదవేగి మండలం న్యాయం పల్లి గ్రామంలో ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు. బైక్‌లకు, కార్‌లకు జెండాలు పెట్టుకుని తిరగడానికి అధికారుల అనుమతి పొందాలన్నారు. ఎన్నికల ప్రచారాలలో మైక్ పర్మిషన్ కూడా పొందాలని ఎస్ఐ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. గ్రామంలో ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతామని ఎస్ఐ హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా ప్రతిఒక్కరూ సత్ప్రవర్తన కలిగి లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట, కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నపాలెం, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్, అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జనతాల సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్: 9492934845, -DRNO :10-11-5/2 , 1 st Floor, Ganesh Chowk Center , Near Ravindra bharathi school, NIDADHAVOLU

బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-04-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1850.0 గ్రాముల వస్తువులు కుదువపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, , Opp.Zed Labs, R.R.Peta, Eluru- 534 002. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road,
Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager,
p.hemanth kumar-80746-56196

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి
ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన బొడ్డు లలిత, తండ్రి/ సుధాకర్ అను నా యొక్క ఒరిజినల్ బిటెక్ సర్టిఫికెట్లు కనపడటం లేదు. ఎంత వెతికినా సర్టిఫికెట్లు దొరకలేదు. 2017–2021 బ్యాచ్ రోల్ నెంబర్ B170207EE National Institute of Technology Calicut, Kerala State. ఈ సర్టిఫికెట్లు ఎవరికి అయిన దొరికిన యెడల సమాచారం తెలియజేయగలరు.
బొడ్డు లలిత, తండ్రి : బొడ్డు సుధాకర్
ఇంటి నెంబర్: 1-82, గోపాల్ నగర్ కాలనీ
ఉప్పలపాడు, కామవరపుకోట మండలం
ఏలూరు జిల్లా - 534439
సెల్: 9398944232

ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి
ఏలూరు జిల్లా, పోలవరం మండలం, కార్మెల్‌పురం (కచ్చేరి)కి చెందిన కస్సే మేరి, W/o. భాస్కర్ (లేటు) అను నాయొక్క ఒరిజినల్ డాక్యుమెంటు ది. 20-3-2024వ తేదీన కార్మెల్‌పురం (కచ్చేరి) నుండి పోలవరం వస్తుండగా మార్గ మధ్యలో నాయొక్క స్థలానికి సంబంధించిన **ఒరిజినల్ డాక్యుమెంట్స్ పడిపోయినవి. డాక్యుమెంట్స్ నెం. 1908/2019, సర్వే నెంబర్: 610/1, బికె-1, సి.ఎస్. నెం. 2018/2019.** కావున దొరికినవారు ఈక్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.
కస్సే మేరి
W/o. భాస్కర్ (లేటు)
పోలవరం మండలం, ఏలూరు జిల్లా
సెల్: 8121587365

దస్తావేజులు పోయినవి
కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు వాస్తవ్యురాలు అయిన గుర్రాల చంద్రశేఖర్ గారి భార్య గుర్రాల హరి ప్రసూనా తెలియజేసుకొనునది.
నాకు ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో (1) **626/1990**, (2) **1685/1990** నంబర్‌తో రిజిస్టర్ ఆస్తి కలదు. ఈ ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ తీసుకొని వెళ్లుచుండగా ఏలూరులో మార్గ మధ్యలో పడిపోయినవి. ఈ ఒరిజినల్ దస్తావేజులు దొరికినవారు ఈక్రింద తెలియపరచిన అడ్రసుకు సమాచారం ఇప్పించండి.
అడ్రస్: గుర్రాల హరి ప్రసూనా
భర్త: చంద్రశేఖర్, డో.నెం. 13-161
తులసి నగర్, కానూరు, కృష్ణా జిల్లా
ఎ.పి. - 520007, సెల్: 9505032354

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
E.P. No. 15/2018
O.S. No. 117/2016
Between:
Alapati Vara Siva Prasad ...DHR
AND
Musunuri Rambabu ...JDR
వేలం ప్రకటన
పై నెంబరు గల E.P. లో పిటీషనరు షెడ్యూలు దాఖలా Property ని శ్రీ కోర్టు వారు ది. 26-4-2024వ తేదీన వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలచినవారు మరియు ఆసక్తి గలవారు పై కోర్టు వారి ఎదుట ది. **26-4-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీ ఐ.డి. Proofs తో అనగా ఆధారు కార్డు మరియు ఇతర కార్డులతో పై కోర్టు ఎదుట హాజరు కావలెను.
E.P. SCHEDULE
Ac. 1.50 cts of land covered by R.S. No. 17/3 of Tallagokavaram (V), Pedavegi (M), W.G.District, K.Kota Sub Registrar within the following boundaries.
EAST: Land of Musunuri Lakshmana Rao.
WEST: Puntha.
NORTH: Musunuri Lakshmana Rao.
SOUTH: Land Bikki Ramesh.
DHR Value: Rs. 3,00,000-00
Amina Value: Rs. 30,00,000-00
NEKKARAGANTI NARASIMHA RAO
Eluru Advocate, Eluru
Dt: 04-04-2024 Cell: 98481 18984